విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 25, జూలై 2024

ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు వైద్య సేవలు అందించండి

- పేషంట్ల నుండి రుసుము వసూలు చేస్తే కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విశాలాంధ్ర - నంద్యాల: ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య సేవ ట్రస్ట్ కింద నిరుపేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి జిల్లా కోఆర్డినేటర్ రూపేంద్రనాథ రెడ్డిని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ఛాంబర్ లో ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సభ్యులతో డిస్టిక్ డిస్సినరీ కమీటి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కింద నిరుపేదల నుండి ఎలాంటి రుసుం వసూలు చేయకుండా నాణ్యమైన వైద్య చికిత్సలు అందించాలన్నారు. జిల్లాలో 25 కార్పొరేట్ ఆస్పత్రులు, 11 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 2 ఏరియా ఆసుపత్రులు, 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 13 దంత వైద్యశాలలు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలలో ప్రభుత్వం సూచించిన 3257 వ్యాధులకు కార్పొరేట్ తరహాలో ఉచిత వైద్యాన్ని అందించాలన్నారు. వైద్య సేవలు పొందిన రోగులనుండి పెండింగ్లో ఉన్న ఫీడ్ బ్యాక్ రిపోర్టులు త్వరితగతిన సేకరించాలన్నారు. వైద్య సేవలు పొంది డిశ్చార్జ్ అయి వెళ్లిన రోగులకు ఎన్టీఆర్ ఆసరా కింద అవస రమైన మందులతో పాటు విశ్రాంతి సమ యంలో జీవన భృతి కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కింద ప్రభుత్వ ఆసుపత్రుల లో రోగుల సామర్థ్యాన్ని పెంచి ప్రభుత్వం నుంచి వచ్చే ఆదాయాన్ని ఆసుపత్రి అభివృద్ధికి వినియోగించాలని ఆమె ఆదేశించారు. సామాజిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే పేషెంట్లకు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు కింద తీసుకువచ్చి చికిత్సలు అందించాలన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో డెంగ్యూ కేసులు నమోదయ్యే నేపథ్యంలో ప్లేట్లెట్స్ గుర్తించే రిఫ్రిజిరేటర్ సెంట్రిఫ్యూజ్ మిషన్‌కు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే ఇవ్వాలన్నారు. శాంతి రాం ఆసుపత్రి, సాయి మల్టీ హాస్పిటల్, ఉదయానంద ఆసుపత్రులలో వచ్చిన ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు కింద ఉచిత వైద్య సేవలు అందించి పేషంట్ల నుండి వసూలు చేసిన మొత్తాలను తిరిగి చెల్లించే విధంగా కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాలలో రోగులకు పోషక ఆహార పదార్థాల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిసిహెచ్ఎస్‌ను ఆదేశించారు. అన్ని ఆసుపత్రుల నిర్వహణకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నిధుల నుండి వినియోగించుకోవాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ కమిటీ సభ్యులు డిసిహెచ్ఎస్ జఫ్రూలా, డిఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర నీటి హక్కులను కాపాడుతాం

విశాలాంధ్ర - నంద్యాల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనారిటీ శాఖామాత్యులు ఎన్ఎండి ఫరూఖ్ ఆద్వర్యంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, ఉపాధ్యక్షులు వైఎస్ రెడ్డి, ప్రచార కార్యదర్శి నిట్టూరు సుధాకర్ రావులు జలవనరుల శాఖామాత్యులు నిమ్మల రామానాయుడిని బుధవారం శాసనసభా ప్రాంగణంలో కలిసారు. రాష్ట్ర సాగునీటి హక్కులకు మరీ ముఖ్యంగా రాయలసీమ జిల్లాలు, నెల్లూరు, నాగార్జునసాగర్ ఆయకట్టుకు సంబంధించి సాగునీటి హక్కులకు విఘాతం కలిగించే విధంగా కేంద్రం తెచ్చిన గెజిట్ నోటిఫికేషన్ ఉందన్నారు. ఈ విషయంపై తగిన కార్యాచరణ చేపడతామని మంత్రి సానుకూలంగా స్పందించారు. రాయలసీమ సాగునీటి హక్కుల పరిరక్షణకు కీలకమైన విధాన పరమైన నిర్ణయాలు, రాయలసీమ హక్కుగా ఉన్న నీటిని పొందడానికి అవసరమైన మౌళిక మైన నిర్మాణాలకు సంబంధిం చిన వినతిపత్రాన్ని బొజ్జా మంత్రికి ఈ సందర్భంగా అందజేశారు. రాయలసిమ అంశాలపై జలవనురుల శాఖ మంత్రి సమగ్రంగా చర్చించడానికి సానుకూలంగా స్పందించారు. దీనికై జలవనురుల శాఖ మంత్రి, రైతులతో ఒక సమావేశాన్ని త్వరలో ఏర్పాటు చేవడతానని న్యాయ శాఖ మంత్రి ఫరూక్ హామి ఇచ్చారు.

సంక్షిప్త సమాచారం

ఒలంపిక్స్ క్రీడాకారులకు సంఘీభావం..

విశాలాంధ్ర - ఆత్మకూర్ టౌన్ : పట్టణంలోని ఉర్దూ స్కూల్ ఇన్చార్జ్ మోహన్ బాబు ఆధ్వర్యంలో ఒలంపిక్స్ కీరకారులకు సంఘీభావాన్ని విద్యార్థులు తెలిపారు. ఉర్దూ స్కూల్ నుండి ర్యాలీగా నంద్యాల టర్నింగ్ మీదుగా గౌడ్ సెంటర్ వరకు ఆటలు ఆడండి, ఆరోగ్యంగా ఉండండి అంటూ కోరస్ పాడుకుంటూ వచ్చారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, ఆత్మకూరు టిడిపి పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ హరి ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశ యువత క్రీడలలో అన్ని విధాలుగా శక్తి సామర్థ్యాలు చూపుతూ ముందుకు దూసుకు వెళ్ళాలన్నారు. ఉపాధ్యాయులు రమేష్ బాబు, శివుడు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఆదాతో ఎక్కువ లాభం..

విశాలాంధ్ర - మహానంది : పోస్టల్ శాఖ అమలు చేస్తున్న పథకాలతో ఖాతాదారులకు ఎంతో ప్రయోజనం అని నంద్యాల డివిజన్ పోస్టల్ ఏఎస్ పి.సత్యనారాయణ అన్నారు. బుధవారం మహానంది మండలం తిమ్మాపురంలోని మాడల్ స్కూల్‌లో విద్యార్థిని, విద్యార్థులకు పోస్టల్ శాఖ అమలు చేస్తున్న పథకాలపై జనంలోకి మనం అనే కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంచార్జి ప్రిన్సిపాల్ రమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్‌పిఎల్ఐ, పిఎల్ఐ, ఆర్డీ, ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ గురించి అవగాహన కల్పించారు. తిమ్మాపురం సబ్ పోస్ట్ మాస్టర్ రహిమాన్, ఎంటలు నరసింహ, రామ శేశిరెడ్డి, బిపిఎంలు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండలంలోని ఆయా గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలు ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఇన్చార్జి ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు ఆయన మాట్లాడుతూ కొలిమిగుండ్ల, తిమ్మనాయునిపేటలలో రెండు ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేశామని తెలిపారు. కొలిమిగుండ్ల ఆధార్ క్యాంపు నందు ఈనెల 25న కనకాద్రి పల్లి, 26, 27న అంకిరెడ్డిపల్లి గ్రామ సచివాలయాల 1, 2 ప్రజలు, తిమ్మనాయుని పేట ఆధార్ క్యాంప్లో 25న కల్వటాల, 26,27న బి ఉప్పులూరు గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్పులు, చిరునామా, పుట్టిన తేదీ తదితర వాటిని సరి చేసుకోవచ్చున్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తు..

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.వేణుగోపాల్ కోరారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాసవి బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపక పోస్టులను భర్తీ చేస్తున్నట్లు కళాశాల తెలియజేశారు. ఈ కళాశాలలో ఎకనామిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, పొలిటికల్ సైన్స్ పోస్టులకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలియజేశారు. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల ప్రకారం పోస్ట్ గ్రాడ్యుయేషన్ అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి ఈనెల 31వ తేదీ ఉదయం ఇంటర్వ్యూలు నిర్వహించబడును. పిహెడి, నెట్/సెట్ పాసైన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు.

గొంతు కోసుకుని ఆత్మహత్యా యత్నం..

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని గుంతపాళెం వీధిలో గొంతు కోసుకుని ఆత్మహత్యా యత్నం చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుంతపాళెంకు చెందిన మహమ్మద్ రఫీ అనే యువకుడు తన ఇంటిలోని మరుగుదొడ్డిలో బ్లేడ్‌తో గొంతు కోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. వెంటనే యువకుడిని కుటుంబీకులు స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేరళ వైద్యశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. ఆత్మహత్యా యత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

జేసీగా బాధ్యతలు స్వీకరించిన విష్ణు చరణ్..

విశాలాంధ్ర - నంద్యాల : జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కలెక్ట రేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్లో జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా సి.విష్ణు చరణ్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణాలను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా నంద్యాల జిల్లాను ప్రగతి పథంలో నడిపిస్తానని, ప్రభుత్వ శాఖ లను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన తెలిపారు.

పంటల సాగులో సస్యరక్షణ చర్యలు పాటించండి..

విశాలాంధ్ర - అవుకు: ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. ప్రాంతీయ సహాయ సంచాలకులు సుధాకర్‌తో కలిసి జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ మండలంలోని సింగనపల్లి రైతు సేవ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ లో సాగు చేస్తున్న పంటలలో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని అన్నారు. జీవామృతం తయారు చేసే విధానాన్ని ప్రత్యక్షంగా రైతులకు చేసి చూపించారు. పీఎం కిసాన్ 5 వెరిఫికేషన్, కిసాన్ కార్డుల పురోగతి గురించి వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులను అడిగి తెలుసుకున్నారు. అలాగే త్వరితగతిన టార్గెట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్, వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు రైతులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - నంద్యాల: నంద్యాల పట్టణం 6 వార్డు జగజ్జనని నగర్ లో వార్డు ఇంచార్జ్ పల్లె వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జరిగిన వార్డు పర్యటనలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి

వార్డు సమస్యల పరిష్కారానికి కృషి

ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొన్నారు. వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ జగజ్జనని నగర్, ఆత్మకూరు బస్టాండ్ ఏరియా, ఫాతిమా మసీదు లైన్‌లలో పర్యటిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 6 వార్డు నందు రోడ్లు, కాలువలు, వీధి లైట్లు సరిగ్గా లేవని ప్రజలు తెలియజేయడంతో వెంటనే అధికారులకు సమస్యలను తెలియజేసి వాటిని పరిష్కరించాలని కోరారు. నంద్యాల ప్రజలు వెంచర్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వెంచర్‌లో స్థలం కొనేటప్పుడు వాటిలో రోడ్లు, కాలువలు, వాటర్ పైప్ లైన్లు సరిగ్గా ఉన్నాయా లేదో, వాటికి ప్రభుత్వ అప్రూవల్ ఉందో లేదో తెలుసుకొని కొనాలని సూచించారు. కొందరు భూ బకాసురులు వెంచర్లు వేసి కల్లబొల్లి మాటలు చెప్పి తీరా స్థలాలు కొనుక్కున్న తర్వాత వాటికి రోడ్లు, కాలువలు వీధిలైట్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు హ్యాండ్‌బాల్, యోగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటయ్య తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన అభినంద సభలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీల్లో ఆళ్ళగడ్డలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో హ్యాండ్‌బాల్ జూనియర్స్ విభాగంలో బాలనరసింహుడు,సబ్ జూనియర్స్ విభాగంలో ఉస్మాన్, వందు, యోగా పోటీలలో 12-14 సంవత్సరాలలోపు విభాగంలో అఖిల్‌కుమార్, 14-16 సంవత్సరాల లోపు విభాగంలో సాజిత్‌లు అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. హ్యాండ్‌బాల్‌కు ఎంపికైన విద్యార్థులు ఆగష్టులో గుంటూరు, కదిరిలలో, యోగాకు ఎంపికైన విద్యార్థులు సెప్టెంబరులో విశాఖ పట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో నంద్యాల జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం కోటయ్య, పిడి దాదాపీర్, పిఈటి భారతి, ఉపాధ్యాయులు శాస్త్రి, మహబూబ్ బాష్, హరినాథ్ రెడ్డి, రవీంద్రారెడ్డి, శ్రీనివాసులు, భాస్కర్ రెడ్డి, మోహన్ రాజు, సూర్యబాబు, బాలయ్య లు అభినందించారు.

మున్సిపాలిటీకి రూ.23.22 లక్షల ఆదాయం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో మార్కెట్ల వేలం పాటలను నిర్వహించారు. ఆళ్లగడ్డ డిఎస్పి షేక్ షర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముగ్గురు సీఐలు, పలువురు ఎస్ఐలు సిబ్బంది తో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. వారపు సంత, దినసరి మార్కెట్, కబేలా మార్కెట్ తదితర మార్కెట్ల వేలం పాటల ద్వారా మున్సిపాలిటీకి రూ.23 లక్షల 22 వేల ఆదాయం లభించినట్లు కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో వేలంపాటలు నిర్వహించేందుకు సహకరించిన డి.ఎస్.పి షర్ఫుద్దీన్, సీఐలు రమేష్ బాబు, హనుమంతు నాయక్‌లకు మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ శబరీష్, జిలాని, యేసురత్నం, బాలస్వామి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ తిప్పపై అక్రమ మట్టి తవ్వకాలు

విశాలాంధ్ర - రుద్రవరం: గత కొన్ని వారాలుగా రుద్రవరం మండలంలోని తువ్వపల్లి తిప్పపై ఇలాంటి అనుమతులు లేకుండా అక్రమార్జనే ధ్యేయంగా ఎంచుకొని అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతూ ఇతర ప్రాంతాలకు టిప్పర్లతో, ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారన్న సమాచారంతో మైనింగ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించినట్లు సమాచారం. మైనింగ్ అధికారులు తువ్వపల్లి తిప్పకు దాడులు నిర్వహించేందుకు వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న అక్రమ మట్టి వ్యాపారులు అక్కడి నుండి పదుల సంఖ్యలో ఉన్న టిప్పర్లను, ట్రాక్టర్లను హుటాహుటిన ఇతర ప్రాంతాలకు తరలించినట్లు సమాచారం.

పట్టణంలో ముస్లిం ఖబరస్తాన్ పరిశీలన

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: పట్టణంలోని ముస్లిం ఖబరస్తాన్ లో వర్షపు నీరు నిలువ ఉండటంతో ఆ నీటిని కాలువ ద్వారా బయటకు పంపుటకు కాలువను గుండ్లకమ్మ వాగుకు లింక్ చేయూట, అక్కడ ఉన్న చెత్తను తొలగించి దబ్బాలను వేరే చోటికి మార్చుటకు కాంట్రాక్టర్ కల్వర్టు ఏర్పాటు అయ్యాక అక్కడే వదిలేసిన మట్టి దిబ్బలను తొలగించుటకు శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాల మేరకు పరిశీలించి పని పూర్తి చేయుటకు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. అంజుమన్ ఎ ఖబరస్తాన్ కమిటీ చైర్మన్ మోమిన్ హుసేన్ సాబ్, ఆత్మకూరు ముస్లిం అంజుమన్ వేల్ఫేర్ సొసైటీ చైర్మన్ మోమిన్ ఇబ్రాహీం ఖలీలుల్లా, టీడీపీ మైనారిటీ నాయకులు ఆసర్ నూర్ బేగ్, కార్యకర్తలు, అభిమానులు, మున్సిపల్ కమిషనర్, పట్టణ ప్లానింగ్ అధికారి, అసిస్టెంట్ ఇంజనీర్, శానిటరీ ఇన్స్పెక్టర్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ చికిత్సలు

విశాలాంధ్ర - అవుకు: పశువులకు ఉచిత గర్భకోశ నివారణ చికిత్సలను చేయడం జరుగు తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు మారుతీ సకారం అన్నారు. మండలంలోని సంఘ పట్నం గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం కింద ఉచిత గర్భకోశ నివారణ చికిత్స కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ మారుతి సకారం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండల టిడిపి యువ నాయకుడు ఉగ్రసేనారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సబ్సిడీ ధరకు గడ్డి విత్తనాలను పాడి రైతులకు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మారుతి సహకారం మాట్లాడుతూ పశువులలో గర్భకోశ వ్యాధులు నివారించడానికి సమతుల్య ఆహారాన్ని పశువులకు ఇవ్వాలని రైతులకు సూచించారు. 32 పశువులకు వైద్యం అందించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ భారతి దేవి, రాజేష్, ముక్తార్,కమల్ హాసన్, ఏహెచ్ఎలు పాడి రైతులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ బలోపేతానికి కృషి

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ నేట్ల మహేశ్వరి,జనసేన నాయకులు శ్రీనివాసరెడ్డి లు అన్నారు. బుధవారం గ్రామంలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాగలమర్రి మండలంలో జనసేన పార్టీ లో చేరేందుకు ప్రజలు ఆసక్తి కనపరుస్తున్నారని అందుకే తాము వార్డు సభ్యులు, కార్యకర్తలు పార్టీలో చేరడం జరిగిందన్నారు. తాలూకా జనసేన పార్టీ ఇంచార్జ్ ఇరిగెల రామ పుల్లారెడ్డి, ఇరిగెల బ్రదర్స్ వారి ఆదేశాల మేరకు చాగలమర్రి మండలం బ్రాహ్మణపల్లె గ్రామంలో, మండలంలోని పలు గ్రామాలలో పార్టీ సభ్యత్వం చేర్చి పార్టీ బలోపేతానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. సర్పంచ్ తో పాటుహరినాథ్ రెడ్డి వారి అనుచరులకు జనసేన పార్టీ సభ్యత్వం తీసుకోవడం జరిగింది. పార్టీ అధ్యక్షులు ఆదేశాల మేరకు క్రియాశీలక పార్టీ కార్యకలాపాలలో కూటమి ప్రభుత్వ పాలన విధానాలను ప్రజలలోకి తీసుకెళ్లడం జరుగుతుందని ఆమె తెలిపారు.

కార్యాలయ పనితీరు పరిశీలించిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర - నంద్యాల : జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా బుధవారం జిల్లా కేంద్రంలోని వివిధ పోలీసు విభాగాలను సందర్శించి, వాటి పని తీరును పరిశీలించారు. ముందుగా ఆర్మ్డ్ రిజర్వు, డిసిఆర్బి, బిల్లాఫామ్, స్పెషల్ బ్రాంచ్, పాస్పోర్టు విభాగం, సమావేశ మందిరం, జిల్లా పోలీసు కార్యాలయ పరిసరాలు, మోటార్ వెహికల్ విభాగం, కమునికేషన్స్, ఐటి కోర్, సైబర్ క్రైమ్ వంటి విభాగాలను సందర్శించి పరిసరాలను పరికరాలు, రికార్డులను పరిశీలించారు. ఆయా కార్యాలయ విభాగాల పనితీరును, ఎంతమంది సిబ్బంది, ఏ తరహా విధులు నిర్వహిస్తున్నది సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం, కార్యాలయాల పని తీరును మెరుగుపర్చేందుకు పలు సూచనలు చేసి, వాటిని వెంటనే అమలు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి సంతోష్, ఎస్పీ సిసి నాగరాజు, ఇన్స్పెక్టర్ రవీంద్ర, వేంకటేశ్వరరావు, రిజర్వు ఇన్స్పెక్టర్ మంజునాథ్, నాగభూషణం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త సీసాలో.. పాత సారాలా ఉన్న కేంద్ర బడ్జెట్

విశాలాంధ్ర - నంద్యాల : కొత్త సీసాలో పాత సారా అన్న చందంగా కేంద్ర బడ్జెట్ ఉందని కాంగ్రెస్ నంద్యాల పార్లమెంట్ జిల్లా డిసిసి అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్ విమర్శించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి బడ్జెట్లో కేటాయింపు రూ.15 వేల కోట్లు అప్పు మాత్రమేనని, రాయల సీమకు బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ ఏమైందని ఆయన డిమాండ్ చేశారు. రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులకు కేంద్రం నుంచి ఎంత బడ్జెట్ కేటాయించారో మన రాయలసీమ ఎంపీలు సమాధానం చెప్పాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి పూర్తి మద్దతు లేకపోయినప్పటికీ మన రాష్ట్ర ఎంపీల నుంచి మద్దతు ఉన్నప్పటికీ రాష్ట్రానికి ఏం సాధించలేకపోతే ఇంకెప్పుడు సాధిస్తారని నిలదీశారు. మన ఎంపీలు పార్లమెంట్లో రాయలసీమ సమస్యల పైన గళం వినిపించాలని లక్ష్మీ నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా ప్రస్తావనే లేదని, కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ప్రస్తావన లేదని, దుగరాజపట్నం ఓడరేవు, విశాఖ, విజయవాడ మెట్రో రైల్, విశాఖ రైల్వే జోన్ ప్రస్తావన లేదన్నారు. పోలవరానికి సహాయం చేస్తామన్నారు, ఎంత అని చెప్పలేదని, నిర్వాసితుల సమస్య గురించి ప్రస్తావించలేదని ఆయన విమర్శించారు.

అందరి సహకారం మరువలేనిది

విశాలాంధ్ర -వెలుగోడు: అందరి సహకారం మరువలేనిదని, సంతృప్తిగా వెళుతున్నానని ఎన్నికల విధుల కోసం ఆరు నెలల కిందట వచ్చిన తహసీల్దార్ విజయ కుమారి అన్నారు. వెలుగోడు తాసిల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్‌ను రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి అందరూ సంపూర్ణ సహకారం అందించారని అన్నారు. తిరిగి కడప జిల్లాకు బదిలీపై వెళ్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారులు శ్రీనివాసులు, నారాయణరెడ్డి, మండల సర్వేయర్ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమాజానికి క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : పట్టణంలో బుధవారం జిల్లా వికలాంగుల జేఏసీ ఆదనం దేవరాజ్ స్మిత్ సబర్వాల్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ దివ్యాంగుల సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్మిత్ సబర్వాల్‌పై కేసు నమోదు చేయాలని ఎస్సై వరప్రసాద్‌కు వినతి పత్రంఅందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దివ్యాంగులు ఇంటా, బయట మనోవేదనకు గురవుతుంటే మళ్లీ స్మిత అపర్వాలు అగ్గి మీద గుగ్గిలం అన్నట్టు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. బేషరతుగా దివ్యాంగులకు క్షమాపణ చెప్పకపోతే రాబోవు రోజుల్లో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. వికలాంగులు అన్ని రంగాల్లో ముందున్నారని, అది స్మిత సబర్వాల్ గ్రహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు ఓబులేసు, శ్రీనివాస్ రెడ్డి, అలీ, చెన్నయ్య పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీని కలసిన రెడ్ క్రాస్ నాయకులు

విశాలాంధ్ర - నంద్యాల : జిల్లాకు నూతన ఎస్పీగా విచ్చేసిన ఆదిరాజ్ సింగ్ రాణాను నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో కలిసి దుశ్శాలువ, పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు కార్యక్రమాల గురించి ఆయనకు వివరించగా, ఎస్పీ హైవే పెట్రోలింగ్ వారికి సిపిఆర్, ఫస్ట్ ఎయిడ్‌పై శిక్షణ ఇవ్వాలని, మొబైల్స్ రావడం ద్వారా తప్పుడు బాటలు వదుతున్న విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన సదస్సులు అత్యుత్తమ సమాజం కోసం నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ దస్తగిరి పర్ల, వైస్ చైర్మన్ మారుతి కుమార్, జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఉస్మాన్ బాష, రోటరీ క్లబ్ మాజీ చైర్మన్ సుధా మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన తహసీల్దార్‌కు సన్మానం

విశాలాంధ్ర - చాగలమర్రి : మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రమణమ్మను కడప జిల్లాకు బదిలీ చేసారు. బుధవారం తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంట్ బీసీ సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు ఆధ్వర్యంలో తహసీల్దారును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కృషి చేసినందుకు అభినందిస్తూ ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు విజయ్‌కుమార్, వీఈఆర్ఓ శ్రీనివాసులు, శారదమ్మ, టిడిపి నాయకులు చోటు, మల్లెవేముల ఓబయ్య, జగదీశ్వర్ రెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అప్రమత్తంగాఉండాలి

విశాలాంధ్ర-రుద్రవరం: కుష్టు వ్యాధి పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, అదనపు ఆరోగ్యశాఖ అధికారిణి శారదా బాయి తెలిపారు. మండలంలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న కుష్టు వ్యాధి సర్వేను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఆమె నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు అందించే వైద్య సేవలపై సిబ్బందిని ఆరా తీసి, రికార్డుల నిర్వహణ రోగులకు తగిన సూచనలు సలహాలు చేశారు. వైద్యాధికారి బాబు, ఎంపీ హెచ్ఈఓ నాగ ప్రసాద్, హెల్త్ సూపర్వైజర్ భూలక్ష్మి, ఏఎన్ఎం రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 25, జూలై 2024

అప్పుల బాధ తాళలేక యువ రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర – కృష్ణగిరి: అప్పుల బాధ తాళలేక యువ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పోతుగల్లు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానిక పోలీ సుల వివరాల మేరకు పోతుగల్లు గ్రామానికి చెందిన వెంకట రమణయ్య ఆచారి కుమారుడైన చక్రి ఆచారి (26) తన కున్న నాలుగెకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ గ్రామంలో ఉన్న చిల్లర కొట్టు అంగడితో జీవనం కొనసాగించే వారన్నారు. గత మూడేళ్ల నుండి వర్ష బావ పరిస్థితుల దృష్ట సరైన పంటలు చేతికి రాకపోవడంతో పొలం నిమిత్తమై రూ.10 లక్షలు అప్పు చేయడం జరిగిందన్నారు. వేసిన పంటలకు గిట్టుబాటు ధర లేక చేసిన అప్పును ఎలా తీర్చాలని మనస్థాపానికి గురై మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వారు తెలిపారు. విషయం తెలుసుకున్న బంధువులు హుటాహుటిన ఆటోలో కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు వారు తెలిపారు. తండ్రి రమణయ్య చారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై ఖాజావలి తెలిపారు. అనంతరం కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టు మార్టం నిర్వహించారు. మృతునికి భార్యతో పాటు కూతురు ఉన్నారు. తన కుమారుడు మృతి చెందడంతో కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

సమన్వయ కృషితో శ్రావణమాస ఉత్సవాలను విజయవంతం చేద్దాం..

విశాలాంధ్ర – కౌతాళం: శ్రావణమాసం ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. బుధ వారం కౌతాళం మండ లం ఉరుకుంద గ్రామం లో 2024 శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా అన్ని శాఖల అధికారుల సమావేశం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ నాగరాజ్ గౌడ్ అధ్యక్షతన దేవస్థానం డిప్యూటీ కమిషనర్, కార్య నిర్వాహణ అధికారి హెచ్ జె.వెంకటేష్ నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆగష్టు 5 నుండి సెప్టెంబర్ 3వ తేదీ వరకు జరిగే శ్రావణమాస ఉత్సవాలకు ఉరుకుంద ఈరన్న స్వామి వారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాక పొరుగు రాష్ట్రాల నుండి లక్షలాదిగా భక్తులు తరలి వస్తారు. వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలైన త్రాగునీరు, విద్యుత్, శానిటేషన్, పార్కింగ్, బారికేడ్లు రవాణా సౌకర్యం, తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. భక్తులకు మెడికల్ క్యాంపులను నిర్వహించాలని అధికారులకు సబ్ కలెక్టర్ ఆదేశిం చారు. ఉత్సవ సమయంలో ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు అమ్మకాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. రవాణా సౌకర్యాలకు ముఖ్యమైన రోడ్ల ను గుంతలు ఉంటే పూడ్చేసి మత్తులు చేయాలని ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డికు ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా భద్రతతో పాటు బారికేడ్లు సీసీ ఫుటేజ్ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి ఉత్సవాలను విజయవంతంగా చేయాలని అధికారులకు సూచించారు. శ్రావణ మాస ఉత్సవాలు సమన్వయంతో విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానము వారి 2024 శ్రావణమాస ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అర్చకులు వీరప్ప స్వామి, ఉప ప్రధానార్చకులు మహాదేవ స్వామి, తహసిల్దార్ అలెగ్జాండర్, ఎంపీడీవో గుప్తా, ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ రఫీ, డాక్టర్ బాల మురళి, సీఐ ప్రసాద్, ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి, సబ్ సీఐ విన్నీలతా, ఆర్డబ్ల్యూఎస్ డీఈ శివ నాగేశ్వరరావు పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వీఆర్ఏలను చిన్నచూపు చూస్తున్న తహశీల్దార్..

విశాలాంధ్ర – హొళగుంద: మండలంలోని వీఆర్ఏలను తహశీల్దార్ ప్రసాద్ చిన్నచూపు చూస్తున్నారని మండల వీఆర్ఏ సంఘం అధ్యక్షుడు మల్లయ్య ఆరోపించారు. బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ వీఆర్ఏలను కార్యాలయంలో పిచ్చి మొక్కలు పీకేయాలని, చెట్లు నరకాలని కార్యాలయంలో కసువు చిమ్మాలంటూ అవనమానకరంగా మాట్లాడుతున్నాడని ఆరోపించారు. బ్రిటీష్ కాలం నుండి రెవిన్యూ శాఖలో కొనసాగుతున్న వీఆర్ఏల వట్ల తహశీల్దార్ చిన్నచూపు చూడడం దురుసుగా ప్రవర్తించడం తగదన్నారు. తహశీల్దార్‌తో పాటు వీఆర్వోలు వీఆర్ఏలకు కనీస గౌరవం, మర్యాదలు ఇవ్వడం లేదని, వీఆర్ఏల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారని, తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వ పనులు చేసుకుంటున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. వీఆర్ఏలకు తహశీల్దార్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే మండలంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలి..

విశాలాంధ్ర – ఆదోని రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త బడ్జెట్లో రాష్ట్రానికి రూ..15 వేల కోట్ల ఆర్థిక సాయం ప్రకటించడం పట్ల రాష్ట్ర ప్రజలకు పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ ఎంఎండి నూర్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి రూ.15 వేల కోట్లు అప్పుల రూపంలో ఇచ్చిందా, గ్రాంట్ రూపంలో ఇచ్చిందా అని రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. 2014లో బిజెపి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారని, 2019లో వైసీపీ బిజెపి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినప్పటికీ రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. ఇప్పటిదాకా పోలవరం ప్రాజెక్టు పూర్తి కాలేకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు తాయన్న పాల్గొన్నారు.

ఎల్ఎల్సీలో గంగాదేవికి ప్రత్యేక పూజలు..

విశాలాంధ్ర – పెద్దకడబూరు : తుంగభద్ర దిగువ కాలువ పరిధిలోని 273.200 కిలోమీటర్ వద్ద పెద్దతుంబళం సమీపంలో ఇరిగేషన్ అధికారులు గంగాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇరిగేషన్ ఏఈ రంగస్వామి గంగాదేవికి కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్లు ఓబులేశు, ఖాజా, లస్కర్లు గులాం, అంజినయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీని కలిగిన బార్ అసోసియేషన్ అధ్యక్షులు

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్ : కర్నూలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌ను అసోసియేషన్ అధ్యక్షులు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బిఎస్ రవికాంత్ ప్రసాద్‌లు మర్యాదపూర్వకంగా కలిసిన పూలే బోకెను అందజేశారు. బార్ అసోసియేషన్ మెంబర్స్ ఎం.త్రివిక్రమ్, నిత్య జీవన్ రాజ్, పి.దస్తగిరి, ఎస్.రాజేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో ఏపీకి ఫలితం..

విశాలాంధ్ర – పెద్దకడబూరు : కూటమి ప్రభుత్వంతో కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ కు తగిన న్యాయం దక్కిందని టిడిపి రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి అన్నారు. బుధవారం పెద్దకడబూరులో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి సగభాగం నిధులు కేటాయించారని హర్షం వ్యక్తం చేశారు. ఇది కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రాంగం వల్లనే సాధ్యపడిందన్నారు. చంద్రబాబుకు కేంద్రంలో ఉన్న పరపతి ఏమిటో ప్రజలకు అర్థమైందన్నారు. నిధులు కేటాయింపు వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. నిధులు కేటాయింపుతో రాష్ట్ర రూపురేఖలే మారనున్నాయని తెలిపారు.

తుంగభద్ర జలాశయం 10 గేట్లు ఎత్తివేత ..

విశాలాంధ్ర – హొళగుంద: కర్ణాటక రాష్ట్రంలోని విజయనగర జిల్లా హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయం 10 గేట్లను బుధవారం తుంగభద్ర బోర్డు ఓఆర్ కె.రెడ్డి ఎత్తివేశారు. తుంగభద్ర జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు ఉండగా ఇప్పటికే 1631 అడుగుల నీరు చేరాయి 105 టిఎంసిగాను 98 టిఎంసిల నీరు ఉంది. 10 గేట్లను ఒక అడుగుల మేర ఎత్తి, తుంగభద్ర నదికి జలాశయం నీటిని విడుదల చేశారు. జలాశయానికి ఇన్‌ఫ్లో 87700 క్యూసెక్‌ల నీరు చేరుతుంది. తుంగభద్ర జలాశయం నుండి హెచ్‌ఎల్‌సి కాలువకు, ఎల్లెల్సీ కాలువకు, రాయ బసవ కాలువ, జిందాల్కు తుంగభద్ర బోర్డ్ అధికారులు నీటిని వదిలారు. నది తీర ప్రాంతాల ప్రజలకు సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరించారు.

గ్రామాన్ని విజిట్ చేసిన స్పెషల్ ఆఫీసర్..

విశాలాంధ్ర – దేవనకొండ రూరల్: మండలంలోని తెర్నేకల్ గ్రామంలో మండలం స్పెషల్ ఆఫీసర్ ఎం.శ్రీనివాస రావు పలు అంశా లపై విజిట్ చేయడం జరిగింది. మొదటగా గ్రామంలో ఎక్కడైతే మెయిన్ రోడ్డుకు ఇరువైపులా వర్షపు నీరు ఆగిన నీటి చూసి హెల్త్ విభాగం వారికి సూచనలు ఇవ్వటం జరిగింది. బస్టాండ్‌లోని మెయిన్ రోడ్డు, పుల్లాపురం రస్తా, వడ్డేగేరి, తెల్లవంక, మసీదు ముందు, ఎస్సీ కొత్త కాలనీ, ఎస్సీ బాలికల వసతి గృహము, జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్నం భోజననం విజిట్ చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొగతాల్ అరుణ్ కుమార్, ఎంపీడీవో ఈద్రుస్ బాష, ఈఓపీఆర్డ్ సూర్య నారాయణ, పంచాయతీ కార్యదర్శులు రాము, సునీతలు విఆర్ఓ మునీర్, ఇంజినీరు అసిస్టెంట్ గోపాల్, సచివాలయం సిబ్బంది,హెల్త్ డిపార్మెంట్, టీడీపీ నాయకులు చిన్న రాముడు, చిన్న తిమ్మప్ప, వెంకప్ప, నాగేష్ పాల్గున్నారు.

హత్యకు గురైన కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా ఎస్పీ..

విశాలాంధ్ర – కర్నూలు క్రైం: ఈ నెల 12న నాగనాథహళ్ళి గ్రామానికి చెందిన గుండమ్మ పొలం తగాధలో హత్యకు గురయ్యారు. ఈ విషయం తెలిసిన కర్నూలు ఎస్పీ జి.బిందు మాధవ్ ఆ కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో జిల్లా ఎస్పీ మాట్లాడారు. కుటుంబానికి ప్రభుత్వం నుండి రావలసిన బెనిఫిట్స్ అన్నింటిని కలెక్టర్‌తో మాట్లాడి త్వరితగతిన వచ్చేటట్లు చూస్తామన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు. నాగనాథహళ్ళి గ్రామంలో తగినంత భద్రతను కల్పిస్తామన్నారు. ఆదోని మండలం, ఇస్వి పోలీసుస్టేషన్ పరిధిలోని నాగనాథహళ్లి గ్రామంలోని 4 ఎకరాల పొలాన్ని తిరుమలమ్మ, సోమ శేఖర్ రెడ్డి దంపతుల నుండి 2019 లో గుండమ్మ కొనుగోలు చేసినట్లు పోలీస్ లు తెలిపారు.ఈ నెల 12వ తేదీన ఆదోని మండలం, నాగనాదనహళ్లి గ్రామ పొలంలో రాఘవేంద్రారెడ్డి, అతని కుమారుడు శ్రీధర్ రెడ్డి, మరో నలుగురు ఈ భూమి విషయంలో గుండమ్మతో వాగ్వాదానికి దిగారని తెలిపారు. 2022 లో గుండమ్మ కుమారుడు కిషోర్ కుమార్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించిందన్నారు. ఈ పొలం విషయంలో గతంలో రాఘవేంద్రరెడ్డి, తిరుమలమ్మ మధ్య వివాదం ఉండడంతో ఆదోని సివిల్ కోర్టులో కేసు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ భూమి కొనుగోలు చేసినప్పటి నుండి పొలాన్ని సాగు చేసుకుంటూ వస్తున్న గుండమ్మను ఈనెల 12న రాఘవేంద్ర రెడ్డి అతని కుమారుడు శ్రీధర్ రెడ్డి, మరో నలుగురు కలిసి భూమి విషయంలో గుండమ్మతో వాగ్వాదానికి దిగి, శ్రీదర్ రెడ్డి గుండమ్మను ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్య చేశారని తెలిపారు. ఆదోని పట్టణం శిరుగుప్ప మలుపు వద్ద జూలై 15న నిందితులైన శ్రీధర్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, సోమశేఖ రెడ్డి సుబ్బారెడ్డి, రామకృష్ణ, గోవింద రాజులను పోలీసులు అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచిన్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ వెంట ఆదోని డిఎస్పీ శివనారాయణ స్వామి, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, స్పెషల్ బ్రాంచ్ సిఐ నాగరాజ్ యాదవ్, ఆదోని గ్రామీణ సీఐ నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

రెండు టిప్పర్లు పట్టివేత..

విశాలాంధ్ర – జిల్లా పరిషత్ : ఉలిందకొండ నుంచి బుధవారం అక్రమంగా రోడ్డు మెటల్ అక్రమంగా రవాణా చేస్తున్న రెండు టిప్ప ర్లను సీల్ చేయడం జరిగిందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తెలిపారు. ఈ టిప్పర్లకు ఒక్కొక్క దానికి రూ.11 వేల ప్రకారం రెండు టిప్పర్లకు రూ.22 వేల అపరాధ రుసుము వసూలు చేసినట్లు ఆయన తెలి పారు. ఈ తనిఖీలో రాయల్టీ ఇన్స్‌పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు

పంట సాగు పత్రాలు.. కౌలు రైతులకు ఎంతో మేలు

విశాలాంధ్ర – పత్తికొండ: పంట సాగు పత్రాలు కౌలు రైతు లకు ఎంతో మేలు చేస్తా యని మండల వ్యవసాయ అధికారి వెంకట రాముడు తెలిపారు. బుధవారం మండలంలోని పుచ్చకాయలమాడ గ్రామంలో గ్రామ సభ నిర్వహించి కౌలు కార్డు గుర్తింపు రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పంటసాగు చేస్తున్న రైతులు కౌలు కార్డుని పొందడం వలన బహుళ ప్రయోజనాలు పొందవచ్చు అన్నారు. పంట సాగు పత్రం భూ యజమానికి, సాగు దారుడుకి మధ్య ఒప్పంద పత్రమని, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగినప్పుడు కౌలు రైతులు నష్టపోకుండా ఈ పత్రాలు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ఈ పత్రానికి 11 నెలలు మాత్రమే గడువు విలువ ఉంటుందని, ఈ పత్రం పొందిన రైతులు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, పంటల బీమా, పంట నష్టపరిహారం, సున్నా వడ్డీ, ధాన్యం పండించిన తర్వాత ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు అమ్మడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. 23 మంది రైతులకు కౌలు కార్డులని జారీ చేయడం జరిగిందని తెలిపారు. గ్రామ రైతులు, ఎంపీటీసీ చంద్ర, వీఆర్ఓ కృష్ణ, వీఏఏలు ప్రవళిక, శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టికేట్‌లు పంపిణీ

విశాలాంధ్ర –గోనెగండ్ల : ఎన్‌సీసీ ఏ సర్టిఫికేట్ ఆంధ్ర గర్ల్స్ బేటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ జోబీ, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ షాహినా పర్వీన్‌లు పంపిణీ చేశారు. బుధవారం మండల కేంద్రంలో స్థానిక మోడల్ స్కూల్‌లో ఎన్‌సీసీ సర్టిఫికేట్‌లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం లో 8,9,తరగతి విద్యార్థినిలకు ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్స్‌ను ప్రధానం చేశారు. ఎన్‌సీసీలో చేరడం వలన విద్యార్థినులకు, క్రమశిక్షణ, ఐక్యత అలవడుతుందని, ఈ సర్టిఫికేట్ ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగకరంగా ఉంటుందని వారు తెలియజేశారు. ఎన్‌సీసీ, సీటీఓ, ఉపాధ్యాయురాలు పద్మావతిని విద్యార్థులను అభినందించడం జరిగింది.

మొక్కలు పంపిణీ చేసిన అధికారులు

విశాలాంధ్ర –కల్లూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన మొక్కలను లబ్ధిదారులకు అధికారులు పంపిణీ చేశారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని జాతీయ రహదారి 44 పక్కన బృందావన్ కాలేజీ ఆవరణంలో ఏపీవో మద్దేశ్వరమ్మ అధ్యక్షతన లబ్ధిదారులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి, ఏపీడి లక్ష్మన్నలు ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో హార్టికల్చర్ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలను వివిధ గ్రామాలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మొత్తం మొక్కలు 4086 నెరవాడ సల్కాపురం గోకులపాడు, మార్కాపురం, బస్తిపాడు, పుసులూరు, తడకనపల్లి, చెట్ల మల్లాపురం, పెద్దటేకూరు తదితర గ్రామ పంచాయతీలకు కొబ్బరి, జామ, మామిడి, సీతాఫల్, నేరేడు మొక్కలను ఆయా గ్రామపంచాయతీలకు సప్లై చేయడం జరిగిందన్నారు. ఏపీడి, ఎంపీడీవో, ప్లాంటేషన్ మేనేజర్, సూపర్వైజర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా జరిగిన గుర్రం జాషువా వర్ధంతి



విశాలాంధ్ర – హొళగుంద: సిద్ధార్థ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో బుధవారం తెలుగు మహాకవి, పద్మ విభూషణ్ పొందిన మహా సాహిత్య వేత్త గుర్రం జాషువా 53వ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. జాషువా చిత్రపటానికి ఎంఈఓలు సత్యనారాయణ, జగన్నాథం, హెడ్మాస్టర్ చిదానంద, రిటైర్డ్ ప్రిన్సిపాల్ రంగ స్వామి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంఈఓ సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు మహాకవిగ, సాహిత్య వేత్తగ గుర్రం జాషువా ఎదిగారని మూఢనమ్మకాలు, ఆర్థిక అసమానతలు తొలగించడానికి పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. పాఠశాల హెడ్ మాస్టర్ చిదానంద, ఎంఈఓలు సత్యనారాయణ, జగన్నాథం పాల్గొన్నారు.

కొన‘సాగుతున్న’ వ్యవసాయ పనులు

విశాలాంధ్ర– కర్నూలు సిటీ: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై దాదాపు 50 రోజులు కావస్తున్నప్పటికీ పంటల సాగు ఆశించిన స్థాయిలో లేదు. గత ఏడాదితో పోలిస్తే జూన్ మొదటి వారంలోనే నైరుతి రుతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ఈసారి రాష్ట్రంలో సంతృప్తికర వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. అందుకు అనుగుణంగానే రైతులు సాగుకు సిద్ధమయ్యారు. జూన్ తొలి వారంలో వర్షాలు పరవాలేదనిపించిన ఆ తర్వాత ముఖం చాటేశాయి. ఈ కారణంగా పంటల సాగు ఆశించిన స్థాయిలో జరగలేదని తెలుస్తుంది. కర్నూలు సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 71730 హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా కేవలం 32,692 హెక్టార్లలో పంటలు సాగు కాగా అందులో వర్షాదారితం కింద 29,470 హెక్టార్లలో ఇరిగేషన్ కింద 3221 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఇప్పటి వరకు సబ్ డివిజన్ పరిధిలో కేవలం 46 శాతం మాత్రమే పంటల సాగు నమోదు అయ్యింది. కర్నూలు మండలంలో ఇరిగేషన్ 4947 హెక్టార్లు వర్షాదారితం 5254,హెక్టార్లు కల్లూరు మండలంలో ఇరిగేషన్ 223 హెక్టార్లు వర్షాదారితం 5002 హెక్టార్లు కోడుమూరు మండలంలో ఇరిగేషన్ 1165 హెక్టార్లు, వర్షాదారితం 13149, హెక్టార్లు, గూడూరు మండలంలో ఇరిగేషన్ 38 హెక్టార్లు, వర్షాదారితం 3267 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. వర్షాలు జోబూచులాడటం, వాతావరణ మార్పుల కారణంగా పంటల దిగుబడి తగ్గిపోవడం, వ్యవసాయ ఖర్చులు పెరిగిపోవడం వంటి కారణాలతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

అంతర పంటల సాగుతో రైతులకు ఆదాయం : ఖరీఫ్‌లో పత్తితో పాటు అధిక విస్తీర్ణంలో సాగ య్యే పంట కంది. అయితే రైతులు చాలా వరకు పత్తి, కందిని ఏకపంటగా సాగు చేస్తూ ఉంటారని, అంతర పంట లను సాగుచేస్తే వ్యవసాయం లాభ సాటిగా ఉంటుందని కర్నూలు సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు శాలు రెడ్డి చెప్పారు. వాతావరణ మార్పులు, చీడపీడలు వ్యాపించి పంట నష్టపోవడం, వ్యవసాయ ఖర్చులు పెరగడం, పంటలు దిగుబడి తగ్గిపోవడం వంటి కారణాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఏడిఏ తెలిపారు. వ్యవసాయంలో రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రైతులు వ్యవసాయం చేస్తే ఆశించిన ఫలితాలు వస్తాయని ఏడీఏ పేర్కొన్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పూర్తి కావాలి

విశాలాంధ్ర – ఆదోని: వచ్చే విద్యా సంవత్సరంలోపు ఆదోని మెడికల్ కళాశాల నిర్మాణాల పనులు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష అధికారులను ఆదేశించారు. బుధవారం ఆదోని సమీపంలో జరుగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మెడికల్ కళాశాల సమగ్ర స్వరూపం, నీటి సరఫరా, తదితర అంశాలను మ్యాప్ ద్వారా పరిశీలించి, వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కళాశాల పనులను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ఆదోని మెడికల్ కళాశాల నిర్మాణాలను పరిశీలించామన్నారు. మెడికల్ కళాశాలకు సంబంధించి అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రెండు విభాగాలు పూర్తి అయ్యాయన్నారు. వీటితో పాటు హాస్టళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, వీటిలో ఒకటి పూర్తి కాగా, ఇంకొకటి పైకప్పు స్థాయి వరకు వచ్చిందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఆదోని సబ్ కలెక్టర్ మెడికల్ కళాశాల ఆవరణంలో మొక్కలను నాటారు. జిల్లా కలెక్టర్ వెంట ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఏపీఎంఎస్ఐడిసి ఈఈ శ్రీనివాసరెడ్డి, ఆదోని తహశీల్దార్ హసీనా సుల్తానా, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడివో కార్యాలయంలో కనపడని ఫోటోలు

విశాలాంధ్ర –హొళగుంద: ఎంపీడీవో కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటోలు కనపడలేదని టీడీపీ నాయకుడు జె.బసవరాజ్ ఆరోపించారు. ప్రభుత్వాలు మారి నెలలు గడుస్తున్నప్పటికీ అధికారులు ఇంకా వైసీపీ మత్తులోనే ఉన్నారని విమర్శించారు. కచ్చితంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పీఎం, సీఎం, డిప్యూటీ సీఎంల ఫోటోలు వేయాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చినా, ఇక్కడ మాత్రం అధికారులు ఆదేశాలను పాటించడం లేదని వాపోయారు. మండలంలో మూడు ఆధార్ కేంద్రాలు సరిపోవని, అదనంగా కొత్త ఆధార్ కేంద్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎండిఓను కలిసిన వారిలో మాజీ మండల టీడీపీ కన్వీనర్ పి.వీరన్న గౌడ, మండల బిజెపి కన్వీనర్ ప్రసాద్, సీనియర్ టీడీపీ నాయకుడు ఎస్.పంపాపతి, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు

ముగిసిన నామినేషన్ల పర్వం

విశాలాంధ్ర –కర్నూలు సిటీ : నగరపాలక సంస్థ స్థాయీ సంఘం కమిటీ సభ్యుల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పర్వం ముగిసింది. చివరి రోజు బుధవారం మరో ముగ్గురు తమ నామినేషన్ల పత్రాలను అదనపు రామలింగేశ్వర్‌కు సమర్పించారు. కాగా మొత్తం నామినేషన్లు వేసిన కార్పొరేటర్ల సంఖ్య 15 మందికి చేరుకుంది. అందులో 1వ వార్డు పింజరి షాషావలీ, 3వ వార్డు షేక్ షాజహాన్ పర్వీన్, 6వ వార్డు షేక్ నిలోఫర్, 7వ పి.జుబేర్ అహ్మద్, 10వ వార్డు షేక్ యూనూస్ బాష, 12వ వార్డు ఎ.క్రాంతి కుమార్, 15వ వార్డు ఎస్.శివమ్మ, 16వ వార్డు ఎం.విజయ కుమారి, 23వ వార్డు కటారి పల్లవి,2 4వ వార్డు జక్కుల రమణమ్మ, 31వ వార్డు మిద్దె చిట్టెమ్మ, 39వ వార్డు సి.హెచ్. సాంబశివరావు, 40వ వార్డు ఎం.విక్రసింహా రెడ్డి, 43వ వార్డు కె.మునెమ్మ, 50వ వార్డు షేక్ అహ్మద్‌లు నామినేషన్లు వేసిన వారిలో ఉన్నారు. గురువారం పరిశీలన ప్రక్రియ జరుగనుంది. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, సెక్రటరీ నాగరాజు, క్లర్క్ జిఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిర్ణయించిన ధరకే ఎరువులను విక్రయించాలి

విశాలాంధ్ర – సి.బెళగల్: మండలంలో రైతులకు కావలసిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, అయితే ఎరువుల దుకాణాల యజమానులు రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అమ్మాలని మండల వ్యవసాయ అధికారి జి.మల్లేష్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లో ఉన్న ఎరువులు, పురుగుమందుల దుకాణాలను వ్యవసాయ అధికారి జి.మల్లేష్ కుమార్ ఓం మురళి సాయి, శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి, ఆ దుకాణాలలోని స్టాక్ రిజిస్టర్‌లను, బిల్ బుక్స్‌ను, గోడౌన్లలో విలువలను వ్యవసాయ అధికారి పరిశీలించారు.

లోకేష్ సార్.. మా ఊరికి విద్యార్థి బస్సు నడపండి

విశాలాంధ్ర – హొళగుంద : మండలంలోని చిన్నహేట పంచాయితీ మజరా గ్రామమైన పెద్దహ్యాటకు విద్యార్థి బస్సు నడపాలంటూ బుధవారం డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. విద్యార్థులు మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శ్రద్ధ వహించి, మా గ్రామానికి కొత్త విద్యార్థి బస్సు సర్వీసు నడిపించాలని కోరారు. ఆలూరు తాలుకా మాదాసి కురువ సంఘం ప్రధాన కార్యదర్శి పెద్దహ్యాట మల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులు రోజు ఉన్నత చదువుల కోసంహొ ళగుందకు దాదాపు 50 మంది విద్యార్థులు వచ్చి, పోతున్నారన్నారు. బస్సులు లేక విద్యార్థినులు నానఅవస్థలు పడుతున్నారని ఆరోపించారు. ఆర్థికంగా స్తోమత కలిగిన విద్యార్థులు సైకళ్ళ మీద, ఇతర ద్విచక్ర వాహనాల మీద పాఠశాలకు పోతున్నారని, ఆర్థికంగా స్తోమత లేక విద్యార్థులు చదువులకు స్వస్తి పలికి చదువులకు దూరం అవుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జ్ బి.వీరభద్ర గౌడ్, జిల్లా కలెక్టర్, రీజినల్ మేనేజర్ ఆర్‌టిసి, ఆదోని డిపో మేనేజర్ చర్యలు తీసుకొని గ్రామానికి కొత్త విద్యార్థి బస్సు సర్వీసు నడిపించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ మండల టిడిపి కన్వీనర్ వీరన గౌడ, మండల బిజెపి అధ్యక్షుడు ఏఈ ఎన్.ప్రసాద్, జిల్లా మాల మహానాడు కార్యదర్శి పెద్దహేట వీరభద్ర, మండల దళిత సంఘం అధ్యక్షుడు సిహెచ్ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మకాలు

విశాలాంధ్ర –దేవనకొండ : మండలంలోని ఎరువుల దుకాణాల యజమానులు రసాయనిక ఎరువులను అధిక రేట్లకు అమ్ముతున్నారని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం మండలంలో ఖరీఫ్ సీజన్ కింద పంటలను సాగు చేస్తున్నారు. మండలంలో అధికంగా పత్తి, ఆముదం, వేరుశనగ సాగు చేస్తున్నారు. అయితే రైతులు రసాయనిక ఎరువుల వాడకం అధికంగా వినియోగిస్తున్నారు. ఇదే అదునుగా భావించి ఎరువుల దుకాణ యజమానులు అత్యధిక రేటుకు అమ్ముతున్నారు. ముందే రైతులు వాతావరణ పరిస్థితులు అనుకూలించక, సాగు ఖర్చులు అధికమై తీవ్రంగా నష్టపోతుంటే మరోవైపు ఎరువుల దుకాణ యజమానులు అధిక ధరల రూపంలో ఎరువులు విక్రయించి రైతులను దగా చేస్తున్నారు. పలువురు ఎరువుల దుకాణ యజమానులు అనధికారికంగా గోడౌన్లు ఏర్పాటు చేసుకుని అందులో ఎటువంటి రశీదులు లేని ఎరువులను ఎక్కువగా నిల్వ ఉంచుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నోమార్లు మండల వ్యవసాయాధికారులు, ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వ్యవసాయ అధికారులు చేసిన తనిఖీల్లో అక్రమంగా దాచి ఉంచిన ఎరువులు, పురుగు మందులు బట్టబయలై వాటిపై కేసులు నమోదయ్యాయి. ఎరువుల దుకాణ యజమానులు ఏమాత్రం వెనుకడుగు వేయకుండా, వారి అక్రమ వ్యాపారాన్ని, కొనసాగిస్తున్నారు. ఒక ఎరువు బస్తాపై రూ.150 నుండి రూ.220 వరకు అధిక ధరల వసూళ్లను మానుకోవడంలేదని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అధిక రేట్లకు ఎరువులను విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్న ఎరువుల దుకాణ యజమానులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు : ఈ విషయంపై మండల వ్యవసాయాధికారి సురేష్ బాబును వివరణ కోరగా రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాము అని, కొరతను చూపించి ఎరువుల బస్తాలను అధిక రేట్లకు విక్రయిస్తున్నారన్న సమాచారం తన దృష్టికి రాలేదన్నారు. విచారించి అలాంటివారిపై తప్పక చర్యలు తీసుకుంటానని తెలిపారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, గురువారం 25, జూలై 2024

స్కూల్ ఆయాల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఆయాలు, స్కావెంజర్స్ పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.శివ బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆయాలు, స్కావెంజర్స్ అర్ధాంతరంగా తొలగింపులు చేసే పరిస్థితిని అరికట్టాలని కోరుతూ నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో గత 19 ఏళ్ల నుండి పాఠశాల ఆవరణ, బాత్రూం శుభ్రపరచడానికి ప్రభుత్వం ఆయాలను నియమించిందన్నారు. వీరికి గత ప్రభుత్వం నెలకు రూ.6 వేలు ఇస్తూ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు రోజుకు నాలుగు సార్లు బాత్రూంలో శుభ్రం చేస్తూ పనిచేయాలని నిబంధనతో చెప్పారన్నారు. కానీ స్వచ్ఛభారత్‌లో భాగంగా ఆయాలు కాకుండా కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూపం ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్యకాలంలో కొన్ని ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేయడం వలన 100 నుండి 300 మంది వరకు పిల్లలు ఉండడం వలన దీనికి ఒక ఆయాతో పని చేయించడం చాలా ఇబ్బందికరంగా ఉందని దీంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఆయాలు అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లాలంటే పాఠశాలలో సెలవు కూడా ఇవ్వని పరిస్థితి ఉందని, పాఠశాలలో వాటర్ ట్యాంకులు లేక వాటర్ బయట నుండి బిందెలతో తీసుకొని బాత్రూంలో ఈరోజు శుభ్రం చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి పేద మహిళలు రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్నారని, ఇప్పుడు అనేకచోట్ల వీరిని పాఠశాల చైర్మన్ కారణం లేకుండా వేధింపులు చేస్తూ తొలగిస్తున్నారని ఆరోపించారు. వీరిని తొలగించకుండా వేధింపులు అరికట్టి ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇచ్చి ఆదుకోవాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ రాజకుమారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకుల కుళాయి స్వామి, వరాలు, ఓబులమ్మ, గుర్రప్ప, సుబ్బరాయుడు, పుల్లమ్మ ఆయాలు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌ల పునః ప్రారంభం దిశగా అడుగులు

విశాలాంధ్ర - నందికొట్కూరు : రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్‌ల పునర్ ప్రారంభం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పట్టణ మున్సిపల్ కమిషనర్ అనుపమ మరియు సిబ్బందితోతో కలిసి అన్నా క్యాంటీన్ పునఃప్రారంభం చేయడానికి సంబంధించిన అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో పేద ప్రజలకు కేవలం రూ.5లతో ఆకలి తీర్చే ఎంతో ప్రతిష్టాత్మకమైన అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయడం చాలా సంతోషదాక విషయమన్నారు. ఇందుకు సంబం ధించి నందికొట్కూరు పట్టణంలో అన్నా క్యాంటీన్ నిర్వాహనకు టెండర్లు పూర్తి కావడంతో భవనాన్ని స్థానిక మున్సిపల్ అధికారులతో కలసి పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు షేక్ అబ్దుల్ రవూఫ్, చాంద్ బాష, లాలు ప్రసాద్, మున్సిపల్ డీఈ నాయబ్ రసూల్, మున్సిపల్ ఆర్వో విజయలక్ష్మి, ఆర్ఐ విక్రమ్, కాంట్రాక్టర్లు తదీతరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఆదాయ పన్ను దినోత్సవం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : పట్టణంలో స్థానిక వాసవి బొమ్మిదాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఆదాయ పన్ను దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె.వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు బాధ్యతగా ప్రభుత్వమునకు పన్ను చెల్లించాలని, ఇలా చెల్లించిన పన్ను ఆదాయమును ప్రభుత్వం ప్రజా సంక్షేమనకు, దేశ అభివృద్ధి కొరకు ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. కామర్స్ ఉపన్యాసకులు యు.వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం బడ్జెట్ నందు మన రాష్ట్రానికి అధిక కేటాయింపులు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సమన్వయకర్త ఇ.వి.భాస్కర రెడ్డి, ఐ.నాగేశ్వర్ రెడ్డి, హెచ్. రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చెపట్టిన సర్పంచ్

విశాలాంధ్ర -గోనెగండ్ల : మండల కేంద్రంలో బుధవారం గ్రామంలో పార్యశుద్ధ్య పనులు సర్పంచ్ పూజారి హైమవతి చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూజారి హైమవతి మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆదేశాలు మేరకు గ్రామంలో వాతావరణం చల్లగా ఉండటంతో, మలేరియా, టైఫాయిడ్,డెంగ్యూ, లాంటి వ్యాధులు బారిన పడకుండా ముందు జాగ్రత్తతో గ్రామంలో పార్యశుద్ధ్య పనులు చేపట్టామని తెలిపారు. పలు చోట్ల డ్రైనేజీలో పిచికారి, బ్లీచింగ్ పౌడర్ చల్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నగిరి అక్బర్ వలి, భారతం హసీనా, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు పత్రాలు కలిగి ఉండాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: వాహనదారులు సంబంధిత పత్రాలు కలిగి ఉండాలని టౌన్ సిఐ గంటా సుబ్బారావు సూచించారు. సీఐ గంట సుబ్బారావు పట్టణంలోని పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్ద విజిబుల్ పోలీసింగ్ చేస్తూ, వాహనాలను తనిఖీ చేసి రికార్డ్స్ లేని వాళ్ళకి కౌన్సిలింగ్ ఇవ్వటం జరిగినది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్పోర్ట్స్ డే కార్యక్రమం

విశాలాంధ్ర - నందికొట్కూరు: పట్టణంలోని స్థానిక బైరెడ్డి నగర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కోట నందు ఆంధ్ర ప్రదేశ్ సమగ్ర శిక్ష,రాష్ట్ర విద్యా శాఖ, జిల్లా విద్యా శాఖ అధికారుల ఆదేశాల మేరకు శిక్షా సప్త వారోత్సవాల్లో భాగంగా బుధవారం పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సలీం బాష ఆధ్వర్యంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్ పెరుమాళ్ళ నిర్వహణలో స్పోర్ట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జూనియర్ కాలేజి విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్, క్రీడా పోషకులు అంద్రెడ్డి శంకర్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు విలువైన సందేశాన్ని అందించారు. క్రీడల ప్రాముఖ్యతను గురించి వివరిస్తూ క్రీడల వల్ల శరీరం ఫిట్ గా ఉంటుందని, మానసిక ఉల్లాసం కలుగుతుందని, గెలుపోటములు సమానంగా స్వీకరించే ధైర్యం వస్తుందన్నారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సలీం బాష, ఉపాధ్యాయినులు శాలమ్మ, అరుణా విజయ భారతి, లలితమ్మ, సరోజినీ దేవి, షంశాద్ బేగం ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శ్రీనాథ్, రామి రెడ్డి, నాన్ టీచింగ్ స్టాఫ్ మురళీ కృష్ణ, పాములేటమ్మ పాల్గొన్నారు.

బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేసిన రవికుమార్ రెడ్డి

విశాలాంధ్ర - నందికొట్కూరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒక్కసారిగా రూ.15 వేల కోట్లు బడ్జెట్ రాష్ట్రానికి కూటమి ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడుపై నమ్మకంతో విడుదల చేయడం జరిగిందని, ఇది చాలా హర్షించదగ్గ విషయం అని బిజెపి నంద్యాల జిల్లా కార్య దర్శి గూడూరు రవికుమార్ రెడ్డి అన్నారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అభివృద్ధికి నూటికి నూరు శాతం అండగా ఉంటుందని చెప్పడానికి ఈ బడ్జెట్లో విడుదల చేసిన ఈ నిధులే సాక్ష్యం అన్నారు. రాయలసీమ అభివృద్ధి జరగాలని చెప్పే రాయలసీమ ముద్దుబిడ్డ పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి కృషితో రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ కేటాయించడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశలో పోలవరం పూర్తి చేయడం విశాఖ స్టీల్ పాయింట్ ముందుకు తీసుకువెళ్లడం పూర్తిగా కేంద్రం బాధ్యతగా వహించి ఇంత భారీ ఎత్తున నిధులు కేటాయించడం జరిగిందని, గతంలో ఇంత భారీ ఎత్తున నిధులు అనేది కేటాయించిన సందర్భం లేదన్నారు.

జేసీగా బాధ్యతలు స్వీకరించిన విష్ణు చరణ్..

విశాలాంధ్ర - నంద్యాల : జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కలెక్ట రేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్లో జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా సి.విష్ణు చరణ్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణాలను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లాను ప్రగతి పథంలో నడిపిస్తానని, ప్రభుత్వ శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన తెలిపారు.

తపాల శాఖలో భీమా భవిష్యత్తుకు పునాది

విశాలాంధ్ర - పెద్దకడబూరు : తపాల శాఖలో జీవిత భీమా చేసి మీ ఉజ్వల ఆర్థిక భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని పోస్టల్ ఇన్స్‌పెక్టర్ నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక రేయిన్ బో ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల నందు పోస్ట్ మాస్టర్ గోపాల్ ఆధ్వర్యంలో తపాల శాఖలో జీవిత భీమా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక నెట్ వర్క్ కల్గిన సంస్థలలో భారత తపాల శాఖ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. తపాల శాఖలో భీమా చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా సుకన్య సమృద్ధి పథకం కింద బాలికల అభివృద్ధి కోసం చిన్న మొత్తాల పొదుపు ఖాతాలను ప్రారంభించారన్నారు. ఈ పథకానికి పది సంవత్సరాల లోపు ఉన్న బాలికలు అర్హులన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు తపాల జీవిత భీమా ఎంతగానో లాభదాయకంగా ఉంటుందన్నారు. ప్రైవేటు పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు లాభాలు ఉంటాయన్నారు. దేశంలో ఏ పోస్టుల్లోనైనా ప్రీయం చెల్లించవచ్చునని, ఆన్లైన్ సౌకర్యం ఉందన్నారు. ఆదాయ పన్ను రాయితీ, ఆకర్షణీయమైన బోనస్, లోన్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. దేశంలో ఇతర ఇన్సూరెన్స్ కంపెనీల కన్నా తపాల జీవిత భీమా ఎక్కువ బోనస్ ఇస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేయిన్ బో పాఠశాల కరస్పాండెంట్ గోవిందరెడ్డి, మెయిల్ ఓవర్సర్ దివాకర్, ఆయా గ్రామాల బీపిఎంలు, ఏబీపిఎంలు, పాఠశాల ఉపాధ్యాయులు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు స్ఫూర్తి దాయకంగా ఉండాలి

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: ప్రతి ఒక్కరు ఆదర్శంగా నిలిచిన గొప్ప నాయకులను స్ఫూర్తిగా తీసుకుని వారి అడుగుజాడల్లో నడవాలని ఎన్సీసీ కమాండింగ్ ఆఫీసర్ జోబీ ఫిలిప్స్ సూచించారు. బుధవారం మాధవ నగర్‌లోని నారాయణ పాఠశాలలో ఏజీఎం రమేష్ కుమార్ ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ అధ్వర్యంలో విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముందుగా ముఖ్య అతిథిగా హాజరైన జోబీ ఫిలిప్ జ్యోతి ప్రజ్వలన చేసి ఎన్నికల ప్రక్రియ, నాయకత్వ లక్షణాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తిలో నాయకత్వ లక్షణాలు పుష్కలంగా ఉంటాయని, వాటిని తరుచుగా బహిర్గతం చేయాలన్నారు. పిల్లల బలాలు బలహీనతలపై తల్లిదండ్రులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. నాయకత్వానికి జరిపిన మాక్ ఎలక్షన్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథి బ్యాడ్జిలు అందజేశారు. స్కూల్ స్పెషల్ లీడర్ ఎన్నిక కొరకై హెడ్ బాయ్, హెడ్ గర్ల్ విభాగాల్లో సీనియర్, జూనియర్‌లకు అగ్ని, త్రిషుల్, నాగ్, పృథ్వీ కేటగిరిలకు ఎన్నికైన విద్యార్థులను అతిథి అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరీ, రాధ, సాఫ్ట్ స్కిల్ టీచర్ నాగరాజు పాల్గొన్నారు.

సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర - వెలుగోడు : మండలంలోని రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి తగిన సలహాలు సూచనలు ఇవ్వాలని ఏడిఏ ఆంజనేయులు తెలిపారు. వెలుగోడులోని రైతు సేవా కేంద్రం 3 నందు వెలుగోడు మండలం రైతు సేవా కేంద్రం సిబ్బందితో ఏడి ఆంజనేయ, ఏవో పవన్ కుమార్ బుధవారం సమీక్ష సమావేశము నిర్వహించారు. రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని, పొలాలు కౌలు చేసుకునే రైతులకు కౌలు గుర్తింపు కార్డు ఇప్పించాలని సిబ్బందికి ఏడి ఆంజనేయ తెలి పారు. ఏవో పవన్ కుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ట్రైకోడెర్మా వెరైటీ సూడోమోనాస్ వంటి బయో ఏజెంట్ల ద్వారా భూసారాన్ని పెంచి భూ ఆరోగ్యాన్ని కాపాడాలని సిబ్బందిని కోరారు. అలాగే భూసార పరీక్షల ద్వారా సిఫారసు మేరకు మాత్రమే రసాయనిక ఎరువులు వాడేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమము లో ఏఈఓ సుధారాణి, వ్యవసాయ ఉద్యాన విస్తరణ సిబ్బంది రామకృష్ణ, వెంకట శివ, స్వర్ణ నాగమణి తదితరులు పాల్గొన్నారు. వెలుగోడు మండలంలోని విత్తన పురుగుల మందులు, ఎరువుల అధికృత డీలర్లకు ఏడి ఆంజనేయ ఏవో పవన్ కుమార్ అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతినెల 5వ తారీఖు లోపల స్టాక్ రిపోర్టులు ఏవో కార్యాలయానికి అందించాలని, బయో ఉత్పత్తులకు సంబంధించి, జి2, జి3 ఉంటేనే అమ్మకాలు జరపాలని, ప్రభుత్వం అనుమతించిన కంపెనీల ప్రొడక్ట్లు మాత్రమే అమ్మకాలు జరపాలని, ఎటువంటి నకిలీ విత్తనాలు ఎరువులు, పురుగుల మందులు అమ్మకాలు జరిపితే వెంటనే లైసెన్సు రద్దు చేస్తామని, డీలర్లకు ఏవో పవన్ కుమార్, ఏడి ఆంజనేయ హెచ్చరించారు.

రాష్ట్ర పునర్నిర్మాణమే చంద్రబాబు ధ్యేయం

విశాలాంధ్ర - నంద్యాల : వైసీపీ పాలనతో 20 ఏళ్లు వెనక్కి వెళ్లిన రాష్ట్రాన్ని పునర్ నిర్మించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయమని తెలుగు యువత నంద్యాల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పిల్లి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నంద్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన చంద్రబాబు నాయుడు కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అవసరమైన నిధులను రాబట్టుకోవడంలో చొరవ చూపారని కొనియాడారు. అమరావతి రాజధానికి రూ.15 వేల కోట్లు, పోలవరం నిర్మాణానికి కేంద్రం పూర్తిగా బాధ్యత వహిస్తుందని ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. వైజాగ్ చెన్నై కారిడార్‌కు నిధులు మంజూరు చేయడం, రాష్ట్రంలో వెనుకబడ్డ ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు బుందేలండ్ లాంటి ప్యాకేజీని సాధించుకోవడం చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని నిరూపించుకోవడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో టిడిపి కార్యకర్తలు పిరోజ్, హబీబ్, ఉదయ్, జమాల్, షేక్షావలి పాల్గొన్నారు.

మా ఊరికి విద్యార్థి బస్సు నడపండి

విశాలాంధ్ర - హెరాళగుంద : మండలంలోని చిన్నహేట పంచాయితీ మజరా గ్రామమైన పెద్ద హ్యటకు విద్యార్థి బస్సు నడపాలంటూ బుధవారం డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. విద్యార్థులు మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శ్రద్ధ వహించి, మా గ్రామానికి కొత్త విద్యార్థి బస్సు సర్వీసు నడిపించాలని కోరారు. ఆలూరు తాలుకా మాదాసి కురువ సంఘం ప్రధాన కార్యదర్శి పెద్దహ్యట మల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులు రోజు ఉన్నత చదువుల కోసం హెళగుందకు దాదాపు 50 మంది విద్యార్థులు వచ్చి, పోతున్నారన్నారు. బస్సులు లేక విద్యార్థినులు నానఅవస్థలు పడుతు న్నారని ఆరోపిం చారు. ఆర్థికంగా స్తోమత కలిగిన విద్యార్థులు సైకళ్ళ మీద, ఇతర ద్విచక్ర వాహనాల మీద పాఠశాలకు పోతున్నారని, ఆర్థికంగా స్తోమత లేక విద్యార్థులు చదువులకు స్వస్తి పలికి చదువులకు దూరం అవుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జ్ బి.వీరభద్ర గౌడ్, జిల్లా కలెక్టర్, రీజినల్ మేనేజర్ ఆర్టిసి, ఆదోని డిపో మేనేజర్ చర్యలు తీసుకొని గ్రామానికి కొత్త విద్యార్థి బస్సు సర్వీసు నడిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఆన్‌లైన్ మోసం.. కేసు నమోదు

విశాలాంధ్ర - కర్నూలు క్రైం : కర్నూల్ టౌన్, డాక్టర్స్ కాలనీ కి చెందిన వి.సాయి రామ్ ఆన్‌లైన్ ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంట్‌లో మోస పోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ మురళీధర్ రెడ్డి ఓ ప్రకటన లో తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్టర్ అమిస్తాకు చెందిన వాట్సాప్ గ్రూప్ లో రోర్క్ కాపిటల్ ఇన్వెస్ట్మెంట్ 79 గ్రూప్ ఆన్లైన్ ట్రేడింగ్ కోర్సు జాయిన్ అయినట్లు తెలిపారు. కోర్సులో బాగంగా ఫిర్యాదిని పాన్ కార్డ్, ఆధార్ కార్డ్‌ని అడుగగా ఫిర్యాది వారికి పంపినట్లు తెలిపారు. దానితో ఫిర్యాది పేరుమీద వారు అకౌంట్ తెరిచినట్లు తెలిపారు. ఎక్కువ లాభాలు వస్తాయని వారి మాటలు నమ్మించగా ఆ అక్కౌంట్ నందు పలు దఫాలుగా రూ.8.40 లక్షలు వేసినట్లు తెలిపారు. తరువాత రూ.81,19,761 వచ్చాయని అక్కౌంట్ నందు చూపించి, ఆ డబ్బులు మీరు తీసుకోవాలంటే అందులో 20శాతం కమిషన్ క్రింద డబ్బులు పంపమని అడిగినట్లు తెలిపారు. దానితో ఫిర్యాది అనుమానం వచ్చి విచారించగా అదంతా మోసం అని తెలుసుకొని పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సదరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంబించిన్నట్లు సీఐ తెలిపారు.

కుష్టు వ్యాధి సర్వేను నిర్వహించండి

విశాలాంధ్ర - బనగానపల్లె: టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్న రాజుపాలెం తాండ, టంగుటూరు, ఇల్లూరు కొత్తపేట గ్రామాలలో డిస్టిక్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టరు టి.తేజస్విని వివిధ గ్రామాలను పర్యవేక్షించి కుష్టు వ్యాధి గ్రస్తులని గుర్తించి వాళ్లకి తగిన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ టి తేజస్విని, టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్ఎస్ శంకరుడు మాట్లాడుతూ ఎవరికైనా చర్మం మీద మచ్చలు స్పర్శ లేని మచ్చలు పూర్తిగా కను బొమ్మలు పూర్తిగా కళ్ళు మూసుకోకపోవడం, కనురెప్ప వెంట్రుకలు రాలిపోవడం చేతుల్లో వస్తువులు జారిపోవడం, చెప్పులు కాళ్లలో జారిపోవడం లాంటి లక్షణాలు ఉంటే ఎంఎల్‌హెచ్‌పిఎస్, ఏఎన్ఎంలు, ఆశలు ఇంటింటికి వెళ్లి కుష్టి వ్యాధి కేసులను గుర్తించి మెడికల్ ఆఫీసర్‌కి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎమ్ఓ రామచంద్రారెడ్డి, ఎం పిహెచ్ఈఓఎస్ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్వైజర్ అయ్యమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి,పసువుల, టంగుటూరు, కొత్తపేట ఆశలు, ఏఎన్ఎం తదితరు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పురోగతిపై ఎస్పీ ఆరా

విశాలాంధ్ర- ఆలూరు : ఆలూరు స్థానిక పోలీస్ స్టేషన్లో పెండింగ్ ఉన్న కేసులపై ఎస్పి జి.బిందు మధు ఆరా తీశారు. బుధవారం స్థానిక పోలీస్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మాత్తుకంగా సందర్శించారు. ముందుగా పోలీస్ స్టేషన్లో ఉన్న పలు కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. అనంతరం దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న కేసులపై పురోగతి పై పలు సూచనలు సలహాలు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక ఆంధ్ర సరిహద్దుల్లో ప్రాంతంలో పోలీస్ స్టేషన్లో అన్ని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా నిషేధిత వసూలు పై గంజాయి, నాటు సారా, మద్యం, రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజలు నిషేధిత వస్తువులపై అమ్మకాలకు అక్రమ రవాణా అమ్మకాలపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని సూచించారు. అంతరాష్ట్ర రహదారులపై ప్రమాదాలు నివారణకు పోలీసులు చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మద్యం సేవించి వాహనం నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటేశ్వర్లు ఎస్సై ఓబులేసు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

96 మద్యం బాటిళ్లు స్వాధీనం

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: మండలంలోని కాకరవాడ గ్రామానికి చెందిన కాలేసాహెబ్ గారి మాబూ బాష అనే వ్యక్తి నుండి 96 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రఫీ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల మేరకు మాబుభాష గ్రామంలో మద్యాన్ని విక్రయించేందుకు 180 ఎంఎల్ 96 బాటిళ్లు తీసుకువెళు న్నాడని రాబడిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఇంజెడు గ్రామ సమీపంలో పట్టుకొని, మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ స్పష్టం చేశారు.